క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు


బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకున్న మరిడమ్మ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలతోపాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

జానపద కళలను పరిరక్షించాలి


శిక్షణ శిబిరంలో కోలాటం నేర్చుకుంటున్న విద్యార్థులు

పెద్దాపురం: జానపద కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పీసీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం కరాటే శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మన సంస్కృతి ప్రతి బింబాలు జానపద కళారూపాలు అన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తెప్పల యోగేష్, లోకేష్‌లు విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇవ్వగా ఊటా అంజలి, అనుషా, జష్వితలు విద్యార్థులకు కోలాటంలో శిక్షణ అందించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, అమత, నమ్రత, రవికుమార్, సాయి, బంగారు, హర్ష, సందీప్, లావణ్య, అంజలి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: కొత్తమూలపేటకు చెందిన వజ్రపు సుబ్బలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత ఆదేశాల మేరకు ఆమె కుటుంబాన్ని శుక్రవారం ఆ పార్టీ నాయకులు పరామర్శించి సంతాపం తెలిపారు. ఆ కుటుంబానికి 50 కిలోల బియ్యం, కొంత నగదు అందజేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మాజీ సర్పంచులు వడ్డీ నాగమణి, మేరుగు ఆనందరావు, సాకా చిన్నబ్బాయి, మాత కుమారి, జెల్లా సుధీర్, వడ్డీ అంబేద్కర్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

సామర్లకోట: స్థానిక సీబీఎం సెంటర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో లేదా స్థానిక న్యాక్ అకాడమీలో దరఖాస్తు చేయవచ్చన్నారు. సర్వేయింగ్ కోర్సులో 75 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, దీనికి ఐటీఐ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అదే విధంగా ప్లంబింగ్‌లో 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, దీనికి 10వ తరగతి నుంచి ఇంటర్ చదివిన వారు అర్హులన్నారు. ఈ శిక్షణలో భాగంగా లైఫ్, కంప్యూటర్ స్కిల్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. వీటిద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని న్యాక్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, 4 పాస్‌పోర్టు ఫోటోలతో స్వయంగా హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96667 71726, 98491 40645, 94407 56250 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు జిల్లా ఈత జట్టు ఎంపిక

సామర్లకోట: వచ్చే నెలలో పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగే 11వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 25న జరుగుతుందని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఇరుసుమల్ల రాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఆ రోజు సామర్లకోట దుర్గాప్రసాద్ స్కూల్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఎంపిక ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఎంపిక ఉంటుందని, 15 ఏళ్లు నిండిన బాల బాలికలు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 92466 904866 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

కల వరి పాట్లు

- వర్షాలకు తడిసిన ధాన్యం
- నీటిలో నానిపోయి కుళ్లిపోయిన పంట
- వీకే రాయపురంలో రైతుల కష్టాలు


తడిసిన ధాన్యాన్ని చూసి కంటతడి పెట్టుకుంటున్న రైతు


వీకే రాయపురంలో నీటిలో మునిగి కుళ్లిన వరి పంటను చూపుతున్న రైతు

సామర్లకోట: ఆరుగాలం కష్టించి సాగు చేస్తున్న పుడమిపుత్రులు నష్టపోతూనే ఉన్నారు.. విత్తు నుంచి పంట విక్రయించే వరకూ ఏదొక రూపంలో కుదేలవుతున్నారు.. ఒకవైపు ప్రకృతి కన్నెర్రజేస్తే, మరోవైపు ప్రభుత్వ సాయం అందక ఇబ్బందులు పడుతున్నారు. సామర్లకోట మండలం వీకే రాయపురం రైతులు ప్రతి పంట సమయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఐదు రోజులు కురిసిన వర్షాలకు వీకే రాయపురం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇక్కడ ఆలస్యంగా వరి నాట్లు వేయడంతో కోతలు ఆలస్యంగా జరిగాయి. దీనికి తోడు పంట భూములు గ్రామానికి దూరంగా ఉండడంతో యంత్రాలతో కోసిన ధాన్యాన్ని పంట పొలాల్లోనే ఉంచారు. వర్షాలు రావడంతో బరకాలు కప్పారు. అయితే బరకాలు కూడా తడిసి ముద్దవ్వడంతో ధాన్యం చెమ్మగిల్లి మొలకలు వచ్చాయి. పలుచోట్ల తడిచిన ధాన్యం ఆరబెట్టే అవకాశం లేకపోవడంతో ముక్కుపోయింది. ఈ ధాన్యం ఏ విధంగా విక్రయించాలో తెలియక రైతన్నలు ఆలోచనలో పడ్డారు. మొలకలు వచ్చిన ధాన్యంపై ఉన్నతాధికారుల నుంచి ప్రకటన రావాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎప్పటికి అధికారులు వస్తారని రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

గతమెంతో ఘనం

గత ప్రభుత్వంలో రైతులకు ఏకష్టం వచ్చినా సకాలంలో సేవలు అందేవి. అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టి పనులు చేసేవారని రైతులు అంటున్నారు. కాజీవే కోతకు గురికావడం, ఏలేరు కాలువ గట్టు కోత బారిన పడడం, తూటేరు డ్రైన్ పూడికతో నిండిపోవడం వంటి సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించేవారని అన్నారు. అయితే ప్రస్తుతం ధాన్యం తడిచి మొలకలు వచ్చాయని మొరపెట్టుకున్నా పట్టించుకునే అధికారులు లేరని రైతులు వాపోతున్నారు. వీకే రాయపురంలో 50 ఎకరాలు, బోయనపూడి గ్రామానికి చెందిన సుమారు 200 ఎకరాల్లో పంట కోయాల్సి ఉండగా, నీటిలో మునిగిపోయింది. ఈదురు గాలులకు చేతికి వచ్చిన పంట చేను నీటిలో నానిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి చేలు నీటిలో మునిగిపోవడంతో పనలు కుళ్లిపోయాయని వాపోతున్నారు. అయితే ఈ భూముల్లోకి వరి కోత యంత్రాలు దిగే అవకాశం లేకపోవడం, ప్రస్తుత వర్షాలతో కూలీలతో కోతలు చేయించకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలీలతో కోతలు కోసి రోడ్డు మీదకు పనలను తీసుకు వస్తే ఎకరానికి రూ. ఐదు వేల నుంచి రూ. ఆరు వేల వరకూ అదనపు ఖర్చు అవుతుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాకతిప్ప సర్పంచ్‌కు పరామర్శ


వైద్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న వంగా గీత

పిఠాపురం: విషపూరిత పురుగు కరవడంతో అస్వస్థతకు గురై పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కొత్తపల్లి మండలం వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబును శుక్రవారం మాజీ ఎంపీ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాసుపత్రి వైద్యులకు సూచించారు. ఆమె వెంట కొత్తపల్లి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు అడపా రఘు కొత్తెం దత్తుడు, సైతన వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


బీఎస్ఎన్ఎల్ సీజీఎం దంపతులకు స్వామివారి ఫొటో అందజేస్తున్న ఆలయ అధికారి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సౌత్ ఇండియా బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.మురళీమోహన్ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చి వారికి అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, మూలవిరాట్, ఉప ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సీజీఎం దంపతులకు పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బళ్ల నీలకంఠం స్వామి వారి ఫోటో, ప్రసాదం ఇచ్చారు. శుక్రవారం ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయంలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ అన్నదాన ట్రస్టు ద్వారా అన్నప్రసాద వితరణ జరిగింది.

జాతరను ప్రశాంతంగా నిర్వహించండి


గ్రామ పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: హుస్సేన్‌పురం గ్రామంలో మదుగులమ్మ జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ పిలుపునిచ్చారు. ఈ నెల 26న జాతరను పురస్కరించుకుని శుక్రవారం గ్రామ పెద్దలతో ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతంలో రెండు వర్గాల మధ్య ఘర్షణల కారణంగా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతరులను రెచ్చగొట్టే విధంగా డ్యాన్స్‌లు వేయడం నిషేధించామని అన్నారు. అదే విధంగా అసభ్య నృత్యాలు ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి ఘర్షణలు జరిగినా, దానికి కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మహిళ పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. జాతరను పురస్కరించుకుని పోలీసు బందోబస్తుతో పాటు, డ్రోన్ కెమెరా ఏర్పాటు చేశామని తెలిపారు. దాంతో అల్లరి మూకలను గుర్తించడానికి వీలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక ఎదుగుదల


యండపల్లిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

కొత్తపల్లి: విద్యతోనే వ్యక్తిగత, సామాజిక ఎదుగుదల సాధ్యమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి తెలిపారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం యండపల్లి గ్రామ సచివాలయంలో కిశోరి వికాసంపై సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ విద్య స్థిరమైన, సంతోషకరమైన జీవితానికి దోహదపడుతుందన్నారు. బాలలకు ఎటువంటి సమస్యలున్నా బాలల హెల్ప్‌లైన్ 1098కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపవైజర్ డి.సుజాత, డి.జ్యోతి, గౌరి పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేయాలి


ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయాలని నినాదాలు చేస్తున్న సంఘ నాయకులు

పెద్దాపురం: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఈ నెల 21న జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ సంఘాల డిమాండ్ చేశాయి. పెద్దాపురం 1వ వార్డు దమ్ముపేటలో శుక్రవారం అమరుల సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 28 మంది బూటకపు ఎన్‌కౌంటర్‌కు బలయ్యారని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వీరాంజనేయులు, రాజబాబు, రమేష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు దూరం

- కూటమి ప్రభుత్వ విధానాలతో నష్టం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత


పిఠాపురంలో ఎండీయూ ఆపరేటర్లకు మద్దతుగా ఆందోళన చేస్తున్న వంగా గీత

పిఠాపురం: పేదలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం దూరం చేస్తుందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మండిపడ్డారు. ఎండీయూ వాహన సేవలను నిలిపి వేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పిఠాపురంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ఎండీయూ ఆపరేటర్ల ఆందోళనకు ఆమె మద్దతు పలికారు. వారితో కలిసి నడి రోడ్డుపై నిరసన తెలిపిన ఆమె ఎండీయూ వాహనాల సేవలను నిలిపి వేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రజలకు అందే పలు పథకాలు దూరం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువ చేసిన పరిపాలనా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వితంతువులు ఇలా బయటకు వెళ్ల లేని అనేక మందికి వారి ఇంటికే తీసుకెళ్లి సరకులు అందించే ఎండీయూ వాహనాలను నిలిపివేయడం కక్ష సాధింపు చర్యగా ఆమె అభివర్ణించారు. లక్షల మందికి నేరుగా రేషన్ అందించే వ్యవస్థను నమ్ముకుని సుమారు 19 వేల మంది జీవనోపాధి పొందుతున్నారని, వారందరినీ రోడ్డుకు ఈడ్చితే చూస్తే ఊరుకోమని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పిఠాపురం పట్టణ, రూరల్, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షులు రావుల మాదవరావు, అడపా రఘు, ఆనాల సుదర్శన్, నాయకులు గండేపల్లి బాబీ, తలిశెట్టి వెంకటేశ్వరరావు, అల్లవరపు మల్లేశ్వరి, లలిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతపు రవికుమార్, జిల్లా ట్రెజరర్ దైవపాల్, పిఠాపురం మండల అధ్యక్షుడు ఆళ్ల సుబ్రహ్మణ్యం, మండల వైస్ ప్రెసిడెంట్ చాట్ల శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె


సామర్లకోటలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు

సామర్లకోట: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం 17వ రోజు కొనసాగింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అయినా మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో శుక్రవారం నోటికి వస్త్రాలు కట్టుకొని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల్లో ప్రభుత్వంతో చర్చలు జరిగే అవకాశం ఉందని, చర్చలు విఫలమైతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. గతంలో సీడీఎంఏ చర్చల పేరుతో తమ సమస్యలు పరిష్కరించడానికి మూడు నెలల సమయం కోరారని, అయినా ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నెల రోజులు కష్టపడి పని చేస్తే చేతికి రూ.13 వేలు వస్తుందని, ఆ జీతంతో ఏవిధంగా కుటుంబాన్ని పోషించుకోవాలని ఆయన ప్రశ్నించారు. 15 ఏళ్ల సీనియార్టీ ఉన్నవారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగవైకల్యానికి గురైన వారికి రూ. ఐదు లక్షల నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఏడాదిలో 55 ఆదివారాలు, కేంద్ర, రాష్ట్ర పండగలకు 17 రోజులు సెలవులు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సీనియార్టీ ప్రాతిపదికలో వేతనాలు చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించక పోతే 20వ తేదీ నుంచి పారిశుధ్య కార్మికులు కూడా సమ్మెలోకి దిగుతారని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాపవరపు నూకరాజు, పులపకూర రామకృష్ణ, మేడిబొయిన వెంకన్న, నక్క రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బదిలీల ఆన్‌లైన్ సేవల కోసం హెల్ప్‌డెస్క్ ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయుల సౌకర్యార్థం కాకినాడ హెడ్ క్వార్టర్స్‌లో అందరికీ అందుబాటులో ఉండే విధంగా పీఆర్ ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలోని ఇండోర్ టీటీ హాల్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు సంఘ అధ్యక్షుడు పెద్దిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి వాడపర్తి మాచరావు, కోశాధికారి నాగు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు గుత్తుల శీను తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాయామ ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉల్లంఘనులు కావొద్దు

- వాహనదారులు నిబంధనలు పాటించాల్సిందే
- కొత్త వాహన చట్టంతో భారీగా జరిమానాలు
- లైసెన్స్ లేకుంటే రూ. 5 వేలు
- మద్యం తాగి నడిపితే రూ. 10 వేలు


వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కాకినాడ సిటీ: ఇక రోడ్డెక్కితే నిబంధనలు పాటించాల్సిందే.. లేకుంటే భారీగా చలానాలు కట్టాల్సిందే.. హెల్మెట్ లేకపోయినా, వాహన ధ్రువపత్రాలు చూపించక పోయినా రూ. వేలల్లో జరిమానాలు సమర్పించుకోవాల్సిందే. ఇదంతా కొత్త వాహన చట్టం చెబుతోంది. గతేడాది జూన్ నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చినా అది క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్ పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో కాకినాడ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు నెలలుగా హెల్మెట్ వాడకం కొత్త వాహన చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చేపడుతున్న ఈ చర్యలకు అంతా సహకరించాలని కోరుతున్నారు.


మైనర్లూ... వాహనాలు నడపొద్దు

గతంలో మైనర్లు వాహనాలు నడిపితే పెద్దగా శిక్షలేమీ ఉండేవి కావు. అయితే రోడ్డు ప్రమాదాలకు మైనర్లు వాహనం నడపడం కూడా ఒక కారణం కావడంతో అధికారులు నిబంధనలు కఠినతరం చేసి, శిక్షలు అమలు చేస్తున్నారు. కొత్త వాహన చట్టంలోని రూల్స్ ప్రకారం మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారికి రూ. 25 వేల జరిమానా విధించడంతో పాటు మూడేళ్ల జైలు శిక్ష కూడా వేసే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి మద్యం తాగి వాహనం నడుపుతున్న 276 మందికిపైగా వాహనదారులను గుర్తించి కోర్టులో హాజరు పరిచారు. అదే విధంగా హెల్మెట్ లేని వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు దురుసుగా ప్రవర్తించే 150 మంది వరకు ఫైన్‌లు కట్టించారు. హెల్మెట్ లేకుండా ఇష్టానుసారంగా మోటారు సైకిళ్లను నడుపుతూ ప్రమాదానికి గురైన వ్యక్తులు దాదాపు 86 మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు కూడా సంభవించాయి.

బండిస్తే అంతే...

చాలా మంది తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలకు బైక్ ఇవ్వడాన్ని చాలా గొప్పగా భావిస్తారు. ఇకపై అది కుదరదు. సదరు బాలుడు లేదా బాలిక బైక్ నడిపి ప్రమాదానికి గురైతే వాహనం ఎవరి పేరునై రిజిష్టర్ అయి ఉందో వారిపై కేసు నమోదు చేస్తారు. ప్రమాదం చేసిన వారితో పాటు వాహనం ఇచ్చిన వారిపైనా, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అమ్మిన వ్యక్తిపైనా కేసు నమోదు చేస్తారు. అప్పట్లో అయితే వెంటనే స్టేషన్ బెయిల్ మంజూరయ్యేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తితో పాటు సంబంధిత వాహన యాజమానికి వెంటనే బెయిల్ వచ్చే అవకాశం లేదు. పదేళ్ల పాటు జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పక్కాగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. వచీ్రాని డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలి.

– ఎస్.రమేష్, ట్రాఫిక్ సీఐ, కాకినాడ